
కథ

# టి.వి.ఛానల్స్ (లీ) ఈలలు



- కీ॥ శే॥ ఆర్.ఎల్.ఎన్.ప్రసాద్

**వాళ్ళ అమ్మాయి సీతామహాలక్ష్మి కోసం నానా అగచాట్లు పడి ఓ పెండ్లిసంబంధం చూసి ఎలాగోలా పెండ్లి చూపుల వరకు తీసుకొచ్చాట్ట. పెండ్లి కుమారుని బామ్మగారు పొరపాటున "అమ్మాయికి పాటలేమన్నా వచ్చా" అని అడిగిందట.**

**గోపాలం** ఎప్పట్నించో ఎరియర్స్ డబ్బులు వచ్చాక ఓ స్కూటరు కొనుక్కొని యీ బస్సు కష్టాలకు స్వస్తి పలకాలని ఆశగా వున్నాడు. అయితే అంత కంటే ముందు ఓ కలర్ టి.వి. కొనాల్సిందేనంటూ ఇంట్లో మెజారిటీ సభ్యుల డిమాండ్. తను గాక ఇంట్లో భార్య, తన ఇద్దరు పిల్లలు, తల్లి, తండ్రి వెరసి ఆరుగురు సభ్యులు. ఇంట్లో ఐదు-ఒకటి ఓట్లతేడాతో తన స్కూటర్ కొనుగోలు తీర్మానం వీగిపోయింది.

"ఆ స్కూటరు ఎందుకు పెట్రోలు దండగ? బోల్డు ట్రాఫిక్ పైగా పొల్యూషన్. బస్సులో అయితే ఎంచక్కా కబుర్లు చెప్పుకుంటూ వెళ్ళొచ్చు" అని సరిపెట్టుకున్నాడు.

ఎంతైనా 'ఆర్టీసి మీది, మాది, మనందరిది' కదా! కాకపోతే, టి.వి అన్నా, దానిలో రకరకాల ఛానల్స్‌లో ప్రసారం చేస్తున్న ప్రోగ్రాములన్నా గోపాలానికి అంతగా సదభిప్రాయం లేదు. అందుకు కారణాలు కూడా చాలా బలంగానే వున్నాయి మరి. వాళ్ళాఫీసులోని టి.వి. బాధితుల గాథలు తనకళ్ళ ముందు రీలులా కదలసాగాయి.

పాపం! తమ సెక్షన్‌లో వుండే క్లర్కు సుబ్రహ్మణ్యం వీధిలో హడావుడిగా వెళ్తుంటే, పక్కన ఎవరో ఇద్దరు వచ్చి "హలో వెంకట్రావు, బాగున్నావా! మమ్మల్ని గుర్తు పట్టావా" అని పరామర్శించారుట. "నాపేరు వెంకట్రావు కాదండీ సుబ్రహ్మణ్యం" అని చెబితే.

"అవున్లేరా సుబ్రహ్మణ్యం! పేరు మర్చిపోయాం. చిన్నప్పుడు మనం గోళీలు ఆడాం, కోతి కొమ్మచ్చి ఆడాం, బొంగరాలు తిప్పాం అరచేతిలో, వెంకాయమ్మగారి మడి చీర ఆరేసిన జామచెట్టు పళ్ళు చీరతో సహాకొట్టుకొచ్చేశాం, గుర్తు రావటంలేదా!" అన్నాట్ట.

"నాకేదీ గుర్తు రావడంలేదు, అసలు మీరెవరో తెలీదు నన్నొదిలేయండి మొర్రో. అవతల అలిగి పుట్టింటికి వెళ్ళిన శ్రీవల్లి ఏదో మనసు చేసుకొని మళ్ళీ వస్తోంది. అది గానీ రైలు దిగేసరికి నేను ప్లాట్‌ఫాం పైన కనపడకపోతే తిరుగు రైలెక్కుతుంద"ని మొరపెట్టుకున్నా వినకుండా, మరో పావు గంట నానా ప్రశ్నల్తో బాదేసి కళ్ళనీళ్ళ పర్యంతం అయిన తరువాత "క్షమించండి సార్! మా ఛానల్ సమర్పించే పట్టుకోండి చూద్దాం. అనే వెరైటీ ప్రోగ్రాం కోసం మీకు తెలియకుండానే మిమ్మల్ని ఇబ్బంది పెట్టాం. మేమడిగిన ప్రశ్నలకు మీరు ఎంచక్కా, ఓపిగ్గా సమాధానాలు చెప్పారు. థాంక్యూ!" అని చెప్పి పక్కనే వున్న వ్యానులో ఉడాయించారట.

మరోసారి పక్క సెక్షన్ ఎస్.ఓ. గోవిందరాజులు గారిని కుక్క కరిస్తే ఆయన బొడ్డు చుట్టూ పద్నాలుగు ఇంజెక్షన్లు చేయించుకొని సెలవు పెట్టి ఇంట్లో వుంటే, మిట్ట మధ్యాహ్నం వేళ మాంచి నిద్రలో వుండగా ఫోను మోగితే ఫోను ఎత్తాడట ఓపిక చేసుకొని. హలో మేం ఫలానా ఛానల్ నుండి "బోలో బోలో ట్రింగ్ ట్రింగ్" అనే కార్యక్రమం తరపున మాట్లాడుతున్నాం. ఇప్పుడు మేమడిగే ప్రశ్నకు మీరు కరక్టుగా 50 సెకన్లలో సమాధానం చెబితే, ప్రఖ్యాత సినీ హీరోయిన్ 'వీరమణి' గారు మీ కుటుంబ సభ్యుల మధ్య రోజంతా గడుపుతారు అన్నార్ట. అసలే కుక్క కరచి బాధపడుతున్న గోవింద రాజులు గారికి ఒళ్ళు మండిపోయినా "సరే! అడగండి" అన్నార్ట. "ఆయనకు నలుగురు అన్న సినిమాలో నటించిన ఆ నాలుగో హీరోయిన్ పేరేమిటో చెప్పండి" అని అడిగారట. సినిమా

పరిజ్ఞానం అంతగాలేని గోవిందరాజులుగారు అంత బాధ, కోపంలోనూ 'ఆయనకు నల్గురా?'' అని బోలెడంత ఆశ్చర్యపడిపోయి, "సాయంత్రం మా అబ్బాయి వచ్చాక కనుక్కొని చెబుతాగానీ, ఆ వీరమణి ఎవరో ఆవిడను కాస్త పంపిద్దురూ! కంపెనీలేక ఒక్కణ్ణే బోర్‌కొట్టి ఛస్తున్నా,'' అని పరాచికాలాడేసరికి అవతల పక్క ఠక్కున ఫోన్ పెట్టేశారట.

ఆ మధ్య సెక్షన్ హెడ్ గుమాస్తా ఆనందరావు వాళ్ళ కాలనీలోకి ఓ పదహారేళ్ళ పిల్ల మైకు పుచ్చుకుని 'హాయ్! మేం ఫలానా ఛానల్ నుండి "భలే ఛాన్సులే" అనే వెరైటీ ప్రోగ్రాం అందిస్తున్నాం. మీరంతా మీమీ టీనేజ్ అనుభవాలని చెబుతారా! అంటూ మైకు పుచ్చుకుని ముందుకొచ్చిందట. మేకప్ వేసుకొచ్చిన ముద్దుగుమ్మ ముందర నిలచే సరికి ఆనందరావు హీరోలా ఫీలయిపోయి మనిషి మూడు వంకర్లు తిరుగుతూ తన టీనేజ్ సంగతులన్నీ ఉన్నవీ, లేనివీ, కలిపి అవాకులు, చవాకులు పేలాట్ట. ఆనక ఆ పిల్ల వేసిన రికార్డుకి ఆ పిల్లతో కలిపి స్థూలకాయుడైన ఆనందరావూ ఎగిరాట్ట. ఆ సమయంలో పుట్టింట్లో వున్న ఆనందరావు భార్య రెండ్రోజులనాడు ప్రసారమైన ఆ ప్రోగ్రాం చూసి "ఎఱ్ఱగా బుర్రగా పిల్ల కనబడేసరికి నోటికొచ్చిన పిచ్చి వాగుడల్లా వాగుతారా? యింతోటి ముఖానికి డాన్స్ కూడానా. ఇంకోసారి ఇలాంటి వెర్రిమొర్రి వేషాలేస్తే విడాకులిస్తాను జాగ్రత్త!'' అంటూ వార్నింగ్ ఇచ్చిందిట.

మరోసారి ప్రక్క సెక్షన్ సుబ్బారావుగారు, వాళ్ళ అమ్మాయి సీతామహాలక్ష్మి కోసం నానా అగచాట్లు పడి ఓ పెండ్లిసంబంధం చూసి ఎలాగోలా పెండ్లి చూపుల వరకు తీసుకొచ్చారట్ట. పెండ్లి కుమారుని బామ్మగారు పొరపాటున "అమ్మాయికి పాటలేమన్నా వచ్చా'' అని అడిగిందట. టివి సీరియల్స్ పిచ్చి విపరీతంగా వున్న సీతామహాలక్ష్మి తన సోడాబుడ్డి కళ్ళద్దాలు సవరించుకుంటూ యథాలాపంగా పెండ్లి కుమారుడిని చూసి నవ్వి లేటెస్ట్ పాపులర్ సూపర్ హిట్ సీరియల్ 'ఖర్మ' టైటిల్‌సాంగ్ "ఎవరి ఖర్మకి ఎవరు బాధ్యులు'' అంటూ కీచుగొంతుతో ఎత్తుకునే సరికి ఆ పెండ్లి కుమారుడు 'వార్నాయనోయ్ నేను మాత్రం కాదు' అంటూ చెప్పులు కూడా వేసుకోకుండా ఉడాయించాట్ట.

**"బోలో బోలో ట్రింగ్ ట్రింగ్" అనే కార్యక్రమం తరపున మాట్లాడుతున్నాం. ఇప్పుడు మేమడిగే ప్రశ్నకు మీరు కరక్టుగా 50 సెకన్లలో సమాధానం చెబితే, ప్రఖ్యాత సినీ హీరోయిన్ 'వీరమణి' గారు మీ కుటుంబ సభ్యుల మధ్య రోజంతా గడుపుతారు అన్నార్ట.**

ఇలా పుంఖాను పుంఖాలుగా తాను విన్నవీ, కన్నవీ, టివీ బాధిత గాథలు మదిలో మెదుల్తుంటే గోపాలం భయంతో వణికిపోసాగాడు. అసలు ఇలాంటి ఛానల్స్ మత్తులో పడి కుటుంబ సభ్యులందరూ ఒకళ్ళతో ఒకళ్లు మనసు విప్పి మాట్లాడుకోవడం తగ్గిపోయింది. దీని వల్ల మనుషుల మధ్య దూరం పెరిగిపోయి కష్ట సుఖాలు పంచుకునే తోడుకరువై, ఏదో తెలియని అభద్రతకు, మానసిక ఒత్తిళ్ళకు గురువుతున్నారు. రకరకాల పాప్ ఛానల్స్‌లో పాప్ సంగీతం పేరిట వస్తున్న దృశ్యాలకు ఆ పాటలకు పొంతన లేకపోగా అవి ఎంతో జుగుప్సాకరంగా అశ్లీలంగా, అసభ్యంగా వుంటున్నా చాలా కుటుంబాలలో చాలా క్యాజువల్‌గా వాటిని చూసి, జీర్ణించుకోగలిగిన స్థాయికి వస్తున్నారు. కానీ, సమాజంలో యిది యువతపై పరోక్షంగా చాలా దుష్ప్రభావం చూపి వారిని పెడత్రోవ పట్టిస్తున్నది. ఈ పరిస్థితులు పెరుగుతున్న లైంగిక నేరాలకు, యువతలో నెలకొన్న అసహన పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. టి.వి. వంటి ప్రసార మాధ్యమాలు ప్రపంచంలో దేశాలమధ్య దూరాన్ని తగ్గించి ఎప్పటికప్పుడు మెరుగవుతున్నా, విజ్ఞానాన్ని, వాణిజ్య సంబంధాల్ని మన ముందుంచటంలో ఎట్టి సందేహం లేదు కానీ అధికశాతం ప్రజలు దాన్ని వినోద మాధ్యమంగానే పరిగణిస్తూ విలువైన కాలాన్ని, శక్తిని దుర్వినియోగ పరుస్తున్నారు.

ఒక్కసారిగా గోపాలం ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు. "అయ్యబాబోయ్ ఎట్టి పరిస్థితుల్లోనూ టి.వి. కొనుగోలుకు అడ్డుపుల్ల వెయ్యాల్సిందే'' అనుకున్నాడు.

***